క్లుప్తంగా

రెవెన్యూ సిబ్బందికి సర్వేపై శిక్షణ



సర్వేపై అవగాహన కల్పిస్తున్న మునికన్నన్

కర్నూలు (సెంట్రల్): రెవెన్యూ శాఖలో పని చేస్తున్న వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్లకు సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని ఏడీ మునికన్నన్ ప్రారంభించారు. మంగళవారం బి.తాండ్ర పాడు సమీపంలో సర్వేను ప్రారంభించి పలు మెలకువలను వివరించారు. సర్వే ఎలా చేయాలి, విలువలను ఎలా తీసుకోవాలి అనే అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. జిల్లా అధికారి విజయ సారథి పాల్గొన్నారు.

బీసీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మహేష్



కర్నూలు (అర్బన్): బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా సి.మహేష్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు తెలిపారు. నగరంలోని ప్రసూన లా కళాశాల లో మొదటి సంవత్సరం విద్యార్థి అయిన మహేష్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగించామ న్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బీసీఎస్ఎఫ్‌ను బలోపేతం చేసేందుకు, విద్యార్థి సమస్యలపై పూర్తి అవగాహన, అనుభవం ఉన్నందున మహేష్ సమర్థతను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతకు పూర్తి న్యాయం చేస్తానని చెప్పారు.

హంద్రీ-నీవా కాలువలో అడ్డుకట్టను తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): తక్షణమే బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీనీవా కాలువలో వేసిన మట్టికట్టను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలువ పక్కనే నేషనల్ హైవే నిర్మాణ పనులు జరుగుతుండడంతో ప్రత్యేకంగా బ్రిడ్జిని నిర్మించకుండా కాలువలోనే మట్టిని వేసి వాహనాలు వెళ్లేలా చేశారని పేర్కొన్నారు. దీంతో హెచ్ఎన్ఎస్ఎస్‌కు నీటిని విడుదల చేయలేకపోయారని, ఈ కాలువ ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందాల్సి ఉందని వివరించారు. ఈ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే మట్టికట్టను తొలగించి రహదారి కోసం బ్రిడ్జిని నిర్మించుకోవాలన్నారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కళ్యాణదుర్గం మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (55) వ్యవసాయం చేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మనమరాలు కుషి డెంగ్యూ జ్వరంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆస్పత్రికి వచ్చిన ఆయన ఉదయం మెడికల్ షాపుకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో బి క్యాంపు వైపు నుంచి విజయ్ అనే వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

సర్వీసు నుంచి కానిస్టేబుల్ తొలగింపు

కర్నూలు (టౌన్): వీఆర్‌లో (వేకెన్సీ రిజర్వు) పనిచేస్తున్న కానిస్టేబుల్ నరసింహులు విధులకు డుమ్మా కొట్టడంతో పాటు నిర్లక్ష్యం వహిస్తుండటంతో సర్వీసు నుంచి తొలగిస్తూ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం రాత్రి ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కుటుంబ ఆరోగ్యంపై అవగాహన



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థులకు కుటుంబాల దత్తత ద్వారా ఆయా కుటుంబాల ఆరోగ్య సంరక్షణపై మంచి అవగాహన కలుగుతుందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీ 2022 బ్యాచ్ వైద్య విద్యార్థులు స్థానిక బుధవారపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఒక్కో వైద్య విద్యార్థికి మూడు గృహాలు దత్తత ఇవ్వగా వారు తమకు కేటాయించిన గృహ సందర్శనకు వెళ్లి కుటుంబసభ్యుల సమస్యలను అడిగి తెలుసుకుని, వారిని వైద్య శిబిరాలకు తీసుకొచ్చారు. వైద్యవిద్యార్థులు రోగులను పరీక్షించారు. బాడీ మాస్ ఇండెక్స్ కోసం బరువు, ఎత్తు, చుట్టు కొలతలు తీసుకుని వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు ఉన్నారా, పోషకాహార లోపంతో బాధపడుతున్నారా అని పరిశీలించారు. వైద్య శిబిరంలో 300 మందికి బీపీ, షుగర్, రక్తహీనత వంటి పరీక్షలు నిర్వహించి వారందరికీ ఆరోగ్య అంశాలపై అవగాహన కలిగించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే సమాజం, కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కలిగించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ సుధాకుమారి, డాక్టర్లు సింధియా శుభప్రద, రేణుక, అరుణ, స్వర్ణకుమారి, రవినాయక్, నాగరాజు, వెంకటేశ్వర్లు, పుష్పలత, వైష్ణవి, లక్ష్మి శైలజాదేవి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో జాగ్రత్త



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

కర్నూలు సిటీ: ఇటీవల వ్యక్తుల అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతుందని, ఇందులో అధిక శాతం బాలికలే ఉంటున్నారని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, లయన్స్ జిల్లా అధికారి పారా లీగల్ వలంటీర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కేఎస్ఆర్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చిన్నారులను కిడ్నాప్ చేసి భిక్షాటన, వెట్టి చాకిరీ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించడం లాంటి వేధింపులకు గురి చేస్తారన్నారు. పిల్లలు ఇంటర్నెట్ ప్లాట్‌ఫాం పట్ల జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, చిన్నారులు చదువుతో పాటు, సామాజిక సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ కార్యదర్శి లయన్ గోపినాథ్, ఉపకార్యదర్శి లయన్ చిన్నస్వామి, లయన్స్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్లను ఏరివేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతకు చర్యలు తీసుకోవాలని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ట్రీస్ కాంట్రాక్టు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంటు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం లోకాయుక్తలో బోగస్ సర్టిఫికెట్లకు సంబంధించిన కేసు విచారణ జరిగింది. ఈ కేసు విచారణకు ఆయన హాజరయ్యారు. అయితే కేసును సెప్టెంబర్ 2వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు.

సివిల్ సప్లై పథకాలపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై సంబంధిత శాఖలు తమ అభిప్రాయాలను 4వ తేదీలోపు తెలపాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్/డీఆర్వో కె.మధుసూదన్‌రావు కోరారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో ర్యాపిడ్ అసెస్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్, ఐసీడీఎస్, లీగల్ మెట్రాలజీ, సోషల్ వెల్ఫేర్ శాఖల జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సివిల్ సప్లై డిపార్టుమెంట్ ద్వారా ప్రజలకు అందిస్తున్న బియ్యం, బ్యాళ్లు, చక్కెర క్వాలిటీ, క్వాంటిటీతోపాటు వాటిపై ఉన్న సందేహాలు, సలహాలు ఇంటే సూచనలు చేయాలన్నారు. త్వరలోనే డీలర్లు, ప్రజల నుంచి కూడా ఆయా పథకాల అమలుపై అభిప్రాయాలు సేకరించనున్నట్లు డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాద్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): నగర శివారులోని పెంచికలపాడులో ఉన్న విశ్వభారతి మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్‌లో ఓ యువతికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. వివరాలను పీడియాట్రిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ కృష్ణనాయక్ మంగళవారం వివరించారు. అనంతపురానికి చెందిన 20 ఏళ్ల యువతి కడుపునొప్పితో జనరల్ సర్జరీ విభాగానికి వచ్చింది. ఆమెకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించగా పెద్దపేగులో గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు తనతో పాటు డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు చెప్పారు. ఇది చాలా అరుదైన జబ్బు అని ఇప్పటివరకు దేశంలో కేవలం 10 మందికి మాత్రమే నమోదైయ్యిందన్నారు. యువతి కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు



పశువులను గోశాలకు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగరంలో ఎద్దులు, ఆవులు, గేదెలు, శునకాలను రోడ్లపైకి వదిలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాష ఆదేశాల మేరకు.. నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడపడితే అక్కడ పశువులను వదిలేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, అలాగే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లపైకి పశువులను వదిలిన యజమానులకు జరిమానాలు విధించామన్నారు. ఇదిలాఉండగా గుత్తి పెట్రోల్ బంకు వద్ద పశువుల తరలింపును పలు సంఘాల నాయకులు అడ్డుకుని మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆరోగ్య శాఖ అధికారి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఆర్‌యూ ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య ఎన్.నరసింహులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య ఎన్.నరసింహులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నరసింహులు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయన గతంలో 2019 నుంచి 2022 వరకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే వర్సిటీ ఎకనామిక్స్ విభాగ సమన్వయకర్తగా ఆ విభాగ సహాయాచార్యులు డాక్టర్ ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎకనామిక్స్ విభాగ అధ్యక్షుడిగా పనిచేసిన ఆచార్య ఎన్‌టీకే నాయక్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా నియమితులు కావడంతో డాక్టర్ శ్రీధర్‌ను సమన్వయకర్తగా నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య నరసింహులుకు వివిధ విభాగాల అధ్యక్షులు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ ఉంటుందని విశ్వభారతి మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ డి.కాంతారెడ్డి చెప్పారు. విశ్వభారతి మెడికల్ కాలేజీలో మంగళవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మునీరుద్దీన్ అహ్మద్, డాక్టర్ ఎం.మహేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ ఎం.పెద్దసురేష్, అసోసియేట్ ప్రొఫెసర్ వాజిద్ బాషా పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. వారు మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో షిరిడీ సాయినగర్, నజర్ కాలనీ, అయిషా నగర్, రాంనగర్, నాల్గవ తరగతి కాలనీల్లో రూ.2 కోట్లతో అంతర్గత డబ్ల్యూబీఎం రోడ్లు, అలాగే ముజుందర్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి కేసీ కెనాల్ యూటి జొహరాపురం రోడ్డు వరకు మేజర్ డిస్పోజల్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబ్ల్యూబీఎం రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఎంఈ శేషసాయి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, డీఈఈ రవి ప్రకాష్‌నాయుడు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం



డీసీసీబీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన పాలకవర్గ సభ్యులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. మంగళవారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పాలకవర్గం ఎన్నిక కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా పి.రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా ఎం.రమాదేవి, సెక్రటరీగా ఎస్.విజయసింహారెడ్డి, కోశాధికారిగా కే.సుధాకర్ పాలక వర్గం సభ్యులుగా భీమిశెట్టి భార్గవి, అపర్ణ, అనుపమ, నారాయణరెడ్డి, మాధన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ సభ్యులను డీసీసీబీ సీఈఓ విజయకుమార్, జనరల్ మేనేజర్ రామాంజనేయులు, డీజీఎం నాగిరెడ్డి అభినందించారు. సొసైటీ సభ్యుల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అధ్యక్షుడు రాఘవేంద్ర తెలిపారు.

కంటి జబ్బులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ సంధ్యారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ఉపాధ్యాయులు విద్యార్థుల కంటి జబ్బులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ సంధ్యారెడ్డి సూచించారు. మంగళవారం కర్నూలు అర్బన్, రూరల్ సైన్స్, పీఈటీ ఉపాధ్యాయులకు స్థానిక ఎంఆర్‌సీ భవనంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని ఎలా గుర్తించాలి అనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారెడ్డి మాట్లాడుతూ.. దృష్టిలోపం, మెల్లకన్ను, కంజెంటివైటిస్, విటమిన్ ఏ లోపంపై శిక్షణలో ఉపాధ్యాయులకు వివరించామన్నారు. దృష్టి లోపం ఉన్న వారిని త్వరగా గుర్తించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని చెప్పారు. మండల విద్యాధికారులు విజయకుమారి, ప్రభావతమ్మ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎస్.సత్యనారాయణ, పి.పరమేశ్వరరెడ్డి, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాలి



భారత క్రీడాకారులకు మద్దతు తెలుపుతున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తదితరులు

కర్నూలు (టౌన్): ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు పతకాలు సాధించడం శుభపరిణామమని, మరిన్ని పతకాలు సాధించాల ని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అకాంక్షించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో భారత క్రీడాకారులు ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో మను బాకర్ కాంస్య పతకం, మిక్స్‌డ్ డబుల్స్ షటింగ్‌లో మనుబాకర్, సరబ్ జ్యోత్ సింగ్‌లు కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు డీఎస్‌డీఓ, వి.ఆర్.హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వాసురెడ్డి అభినందనలు తెలిపారు

మేమింతే.. మాది రాంగ్‘రూటే’!



ఇటీవల కాలంలో ట్రాఫిక్ పోలీసుల తీరు విమర్శలకు తావిస్తోంది. చిన్నాచితక వ్యాపారుల చుట్టూనే వీరి విధి నిర్వహణ కనిపిస్తోంది. రాజ్‌విహార్ నుంచి పాతబస్టాండ్ వరకు ఎక్కడ చూసినా భారీ వ్యాపారాలు నిర్వహించుకునే దుకాణాల ఎదుట పెద్ద సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేసి ఉంటున్నా ఒక్కరోజు కూడా చలానాలు విధించిన దాఖలాలు లేవు. ఇక అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ ప్రాంతంలోకి వెళ్లి రావాలంటే పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. ఇక్కడ ఏ రోజు కూడా పోలీసులు కనిపించరు. అయితే ప్రతిరోజూ కేసీ కెనాల్ అయ్యప్ప గుడి ప్రాంతంలో మాత్రమే పోలీసులు తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారి తక్కెడ తూకాలను తీసుకెళ్తూ కనిపిస్తుంటారు. రోడ్డుకు అడ్డంగా వ్యాపారాలు చేస్తున్నారని దబాయించడం, వాళ్లు పాపం వెంట పడి ఇకపై చేయబోమని వేడుకోవడం పరిపాటిగా మారింది. అయితే మంగళవారం ఇదే పోలీసులు రద్దీ ప్రాంతమైన సెంట్రల్ ప్లాజా వద్ద కలెక్టరేట్ వైపునకు రాంగ్‌రూట్‌లోనే రికవరీ వ్యాన్‌ను తీసుకెళ్లడం, దాని వెంటనే పోలీసులు కూడా ద్విచక్ర వాహనంపై రాంగ్‌రూట్‌లోనే వెళ్లడం చూసి వాహనదారులు ముక్కున వేలేసుకున్నారు. వాళ్లు ఎలాగైనా వెళ్లొచ్చు కాబోలు, రూల్స్ మనకు మాత్రమేనని గొణుక్కుంటూ వెళ్లిపోవడం కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు